# వంకి

గోపీకి ఆలోచన లెక్కువ. చిన్నప్పుడే మలేరియా వచ్చింది. పైత్య శరీరం. "పైత్యం ఎక్కువయితే మలేరియా వచ్చిందా? మలేరియా ఎక్కువయి పైత్యం వచ్చిందా?" అని యింకా ఆలోచిస్తూనే వున్నాడు.

"చెట్టు ముందా విత్తు ముందా?" అనేది పెద్దప్రశ్న. పెద్దప్రశ్నలేవీ తేలవుగా! కాని, గోపీకి ఆలోచనజాస్తి. అందరిలాగా తేలేవాటిని గురించి ఆలోచిస్తాడా? తేలనివాటిని గురించే ఆలోచిస్తాడు. జీవితమంతా ఆలోచిస్తూనే వున్నాడు.

ఈలోగా మధ్యమధ్య చిన్నచిన్న ఆలోచనలు చెబుతాను. సినిమాకు పెద్ద కథ రాస్తూవుంటాం అనుకోండి. ఈలోగ చిన్నచిన్న ఆలోచనలు తడితే చిన్నకథలు రాసి పూర్తి చెయ్యం! పెద్ద కథ అలా జరుగుతూనే వుంటుంది. చిన్నకథలు పూర్తవుతాయి. ప్రచురిస్తాం. కాని అసలు పెద్ద కథ సంగతి మరచిపోం. ఆలోచిస్తూ వుంటాం. ఆలోచించటమే ఆలోచించటం.

"ఆలోచనలు ఎక్కువయ్ చెడిపోతున్నావ్!" అన్నాడు తండ్రి.

"చెడిపోవటమంటే ఏమిట?" అడిగాడు గోపీ.

"ఇదే, ఇదే" అన్నాడు తండ్రి.

అన్నీ ఇలాగే....

"చెట్లు భూమిలోకి ఎందుకు పెరగదు? పైకి ఎందుకు పెరుగుతుంది? లోపలికి పెరిగితే ఏమవుతుంది?" అని తనలో తానే నవ్వుకుంటాడు.

"కారుకూడా ప్రాణం వుందేమో? లేకపోతే ఎట్లా నడుస్తుంది?" అని ప్రశ్న.

"ఉంటే మనకు తెలియదా?" అని జవాబు.

"పశువులకు ప్రాణం వుంది. అవి చేసేమోతలు మనకు అర్థం అవుతయ్యా? కారు మోతచేస్తూ వుంటుంది." అని సమాధానం.

"వానపాము ఏమోతా చెయ్యదు అలా నడుచుకుంటూ పోతుంది. అందులో ప్రాణం వుందని ఎలా? కారూ అంతే! నడుచుకుంటూ పోతుంది. మోతకూడా చేస్తుంది. కారుకీ ప్రాణం వుంది."

కానీ అంతటితో వూరుకోడుగా—

"వానపాముని చంపితే బతికించలేం. కారుని చంపావచ్చు. బతికించావచ్చు. ఇదెట్లా?" అని ప్రశ్న.

"అదోవిచిత్ర ప్రకృతి, రకరకాల జీవులు, రకరకాల ప్రకృతులు—అన్నీ ఒక రకం అయితే ప్రపంచం ఎలా అవుతుంది? స్వర్గం అవుతుందిగా! స్వర్గంలో చూచారా చావాచావరు. బతకా బతకరు.వాళ్ళకు బుద్ధిలేదు. బుద్ధున్న వాళ్ళు రెండూ చేస్తారు."

ప్రతిదీ ఇంతే—!

కొన్ని రోజుల్నుంచీ, మరో ఆలోచన పట్టుకుంది. ఎక్కడ చూచినా ప్రజాసామాన్యం అన్నమాట వినబడుతూ వుంది.

"ఎందుకిట్లా రాశావ్?" అని అడిగాడు.

"ప్రజాసామాన్యానికి అర్థంకావటానికి" అన్నాడు రచయిత.

"ఈ చిత్రం బాగాలేదు. ఇంతకంటే ఇంకా బాగా తియ్యగూడదు?" అని అడిగాడు.

"తియ్యడానికేం? అలా తీస్తే ప్రజాసామాన్యానికి అర్థంకాదు?" అన్నాడా డైరెక్టరు.

అన్నీ అంతే. అందరి పెదిమలమీదా ప్రజాసామాన్యమే!!!

"ప్రజాసామాన్యం క్షేమంకోసం మీరు సత్యాగ్రహం చెయ్యాలి" అంటాడొకడు మరొకడు. "ప్రజాసామాన్యం అంటాడు ప్రజాసామాన్యం క్షేమంకోసం ఇప్పుడు మీరు సత్యాగ్రహం చెయ్యొద్దు" అంటాడు. "ప్రజాసామాన్యం క్షేమంకోసం వితంతువులకు వివాహం చెయ్యాలి" అంటాడొకడు. మరొకడు "ప్రజాసామాన్యంకోసం వితంతువులను అలా వుంచాలి." అంటాడు. కారణాలకేం. కారణాలు ఎన్నైనా చెబుతారు. వినేవాళ్ళుండాలి గాని కారణాలు దొరక్కపోతయ్యా?

"మీకేం? మీరెన్నన్నా చెబుతారు. ప్రజాసామాన్యం అందుకింకా తయారు కాలేదు" అన్నాడొక సంఘ సంస్కర్త.

గోపీ ఆలోచించాడు. చెప్పాగా అతనికి ఆలోచనలు ఎక్కువనీ; ఆలోచనలు ఎక్కువై చెడిపోతున్నాడని తండ్రి అన్నాడనీ!

ఎవరేమన్నా ఆలోచించటం ఎట్లా మానివేస్తాడు? మానేస్తే గోపీ ఎట్లా అవుతాడు? పీపీ అయ్యేవాడు. అందుకనే ఆలోచించేవాడు.

ఎవ్వరీ ప్రజాసామాన్యం? ఎవరికివాళ్ళు ప్రజాసామాన్యంలో చేరినట్లు మాట్లాడుతారే! మళ్ళా అంతా ప్రజాసామాన్యం క్షేమంకోసం ప్రయత్నిస్తారెందుకు?

అదేం అప్సరసా___?

అప్సరసంటే ఇనప కచ్చడాలవారికి ఇష్టం. మరొకళ్ళయితే వీరి చాతుర్యం చూపడానికి ఏమి వీలుంది? ఇనపకచ్చడాల వారికే అప్సరసంటే ఇష్టం. విశ్వామిత్రుడూ వాళ్లూ లేరూ? వీళ్ళు కళ్ళుమూసుకుంటారు. వాళ్ళు అభినయం పడతారు. ఇంకేం? రస సృష్టి అవుతుంది. ప్రవరుడైతే పారిపోతాడుగా!

'శ్రీహరీ!'

మరి ఇక్కడ అలాకాదే! ప్రజాసామాన్యం అంటే అందరికీ ఇష్టమేనే!

ఇదేం డబ్బున్న వితంతువా?

అలాగయితే అంతామూగుతారు. పాపం వితంతువుకి ఎవ్వరున్నారు. ఉన్న పొలం దున్నించుకోవాలన్నా ఎవరిమీదో ఆధారపడాలి. తండ్రికూడా లేకపోతే మరీ వాటం. భర్తతరపునుంచి ఏదో వస్తుందిగా! అదుంటుంది. నా అనే వాళ్ళెవరుంటారు? చూడగా మన సంఘంలో వితంతువులవనే వాటంగా వున్నట్లుంది. వాళ్ళు జీవించటానికి మగవాళ్ళ అండ కావలసి వస్తుంది. అన్నదగ్గిరా, తమ్ముడి దగ్గిరా వుండిబుద్ధనదు—వుంటే వదినా మరదలూ బతకనిస్తారా ఏమిటి! అందుకని వాక్కత్తే వేరేగా వుంటుంది.

చూడండి. ఒక వితంతువు—భర్తతరపు ఆస్తి వుంటుంది. వితంతువు సబ్బు వాడకూడదుగా! అందుకని కొబ్బరినూనెతో స్నానంచేస్తుంది. వొళ్ళు మున్నగా గట్టిగా వుంటుంది. కొబ్బరినూనె వాడటంవల్ల శరీరానికి వేడెక్కుతుంది.

ఇక చలంగారి నరాలబాధ. ఆ బాధ దాక్కోదుగా! కళ్ళలో కనిపిస్తుంది. కళ్లారుకుంటాయా? అందర్నీ ఆహ్వానిస్తాయి.

అంతా ఎందుకు మూగరూ? చూస్తూ వూరుకుంటానికి మనది పుణ్యభూమాయె!! కనక ప్రజాసామాన్యం వితంతువై వుండాలి.

కాకపోతే, మైనరేమో!

అప్పుడు చూడండి అందరికీ రక్షించి లాలించ బుద్ధవుతుంది. మేజరయ్యేదాకా డబ్బుతో జేబుల్ని నింపుకోవచ్చు. జేబుల్నిండిం తర్వాత అంతా పెద్దమనుషులే! పెద్దమనుషులసంఘంలో ఒకర్నొకరు 'నీజేబులెలా నిండినయ్?' అని అడుగుతారా ఏమిటి?.... పాడు.

ఆ రాత్రి అతనికి కలొచ్చింది. అబ్బో గోపీకి కలరావటమంటే సామాన్యమా? మేల్కొనే కలలుకంటాడు అసలు కలలు ఇంకెంతో చిత్రంగా వుంటాయి!!! మీకుబాగా తెలుసుంటుంది. వానాకాలంలో ముసురుగా వున్నప్పుడు వుసిళ్ళు లేస్తాయి చూడండి— అలా లేచినయి వూహలు!

ఎక్కడికో ఏకాగ్గా నడిచిపోతున్నాడు. ఎక్కడికో? ఎందుకో!! పూరికే నడిచిపోతున్నాడు. కాళ్ళు భూమిమీద ఆనటం లేదు. ఏసుక్రీస్తుకి సముద్రంమీద ఆనాయా ఏమిటి? అలా ఏకాగ్గా పోతున్నాడు. ప్రపంచం లోనూ అంతే....

ఒకవూరు ప్రవేశించాడు. అది వూరనుకోవటానికి కారణం ఏమీలేదు. గోపీకి అనిపించింది-అనుకున్నాడు. అతనితో ఏవైనా అంతే! అనిపిస్తుంది అంటాడు. చెప్పాగా అతనికి ఆలోచన లెక్కువనీ, మరి చిన్నప్పుడే మతే రియా వచ్చిందనీ....

సరే, ఆవూరు సంగతి చెప్తా-ఆవూళ్ళో ఇళ్ళులేవు.

"ఇళ్లు లేకపోతే వూరేలా అవుతుంది?" అని అడుగుతారు.

"ఇళ్ళుంటే వూరెలా అవుతుంది? అలాగే అయిందంటాను."

అలాగే అవుతుంది. అయింది.

ఆ వూళ్లో ఇళ్ళకు గోడల్లేవు.

"గోడల్లేకపోతే ఇళ్ళెలా అవుతాయి?" అని అడుగుతారు. చాదస్తం అంటాను. "గోడలుంటే, గోడలే అవుతాయి. గోడల్లేకపోబట్టే ఇల్లవు తుంది" అంటాను.

ఆ ఇంటి కప్పులు ఆకాశంమీద తేలిపోతున్నాయి.

"ఇళ్ళు లేకపోతే కప్పులెలా వుంటాయి?" అంటారు.

"ఇళ్ళు లేకపోబట్టే కప్పులు అయినయి" అంటాను.

గాలికి ఆ కప్పులు అలా ఇలా వూగుతున్నాయి. జపాన్ కాదు. అక్కడ వూగి వూగి కిందపడతాయి. మేఘాలూకాదు.

గోపీ చూచాడు. చెప్పాగా అతడికి ఆలోచనలెక్కువనీ, ఆలోచన లతో చెడిపోతున్నాడని తండ్రి అన్నాడనీ.

అదంతా చూడాలనుకున్నాడు. ఒక ఇల్లు ప్రవేశించాడు. ద్వారంలో నుంచికాదు, ఇంట్లోనుంచే. గోడల్లేవుగామరి! గోడల్లేకపోతే ద్వారంలో నుంచి ఎలా వెళ్తారు? అందుకని ఇంట్లోనుంచే ఇంటిలోకి వెళ్ళాడు. సరిగా మధ్యకి వెళ్ళాడు.

"ఇల్లుమధ్య అని ఎలా తెలిసింది?" అని అడుగుతారు చాదస్తులు. గోడల్లేనప్పుడంతా మధ్యే, అంతా చివరే, అంతా మొదలే!

కనుక గోపీ మధ్యకు వెళ్ళాడు. బాగానేవుంది. ఇక వూరుకో గూడదూ? ఎలా వూరుకుంటాడు? చెప్పాగా–

అటూ ఇటూ చూచాడు. అన్నిపక్కలా గోడలకుబదులు అద్దాలు కనిపించినయ్.

"అరే?"

అన్ని అద్దాల్లో తన బొమ్మలే కనిపించినయ్. వాటిమీద ఏదో రాశారే!"

వెనక్కి చూచాడు. వెనక్కంటే తనవెనక్కి! మరి ఆ ఇంటికి గోడల్లేవుగా? గోడల్లేనింటికి వెనకుండదుగా! అందుకని తన వెనక్కే చూచుకున్నాడు.

అద్దంలో కనిపించినయ్. కళ్ళు జిగాల్ భుగాల్ మన్నప్పుడు అక్షరాలు కనిపించవుగా! మళ్లాచూస్తారుగా! చూచాడు. అవన్నీ అక్షరాలు వస్తున్నయ్, తళతళ మంటున్నయ్.

చదివాడు....

"ప్రజాసామాన్యం"

"ప్రజాసామాన్యం"

"ప్రజాసామాన్యం"

అన్నద్దాల్లోనూ కనిపించినయ్. చెప్పాగా గోపీకి ఆలోచన లెక్కువనీ....

ఆలోచించాడు. అన్నిద్దాల్లోనూ తనబొమ్మలే! ఒక్కొక్క బొమ్మ మీదా ఈ మాటలు.

"ప్రజాసామాన్యం"

"ప్రజాసామాన్యం"

"ప్రజాసామాన్యం"

వస్తున్నయ్, పోతున్నయ్, తళతళ మంటున్నయ్, పోతున్నయ్.

బలేబాగుందే! అన్నీ ప్రజాసామాన్యాలే! అంతా ప్రజాసామాన్యమే. ఆ సంగతి అసలువారికి తెలియదు. ఆ మాటకొస్తే గోపీకి తెలుసా యేమిటి? తన్ను విడిచిపెట్టుకొని బైట వెతికాడుగా! లోపలకు చూసుకుంటే తెలిసేది. భగవంతుడూ అంతే! భగవంతుడేనా యేమిటి_ ప్రజాసామాన్యం? ఇద్దరూ లోపలేవుంటారే!

"సిగ్గా?"

అటువంటప్పుడు భయం వెయ్యదూ? భయంవేస్తే పరిగెత్తాలని పుస్తకాల్లో చదివాడుగా! పరిగెత్తడూ?

గోపీ పరిగెత్తాడు. బొమ్మలన్నీ పరుగులెత్తాయి. ఎవరి ప్రజాసామాన్యం వారివెంట పోదూ!

భయమనుకున్నాడు, భయపడ్డాడు. పరిగెత్తాలనుకున్నాడు. పరిగెత్తాడు. అతనితో యేపనయినా అంతే. చెప్పాగా అతననుకుంటాడనీ, చేస్తాడనీ.... ఎలాగయితే పరిగెత్తాడు. బైటికిరాగానే బొమ్మలన్నీ అతనిలో లీనమయి పోయినయి.

"అంటే?"

ప్రజాసామాన్యం తన యథాస్థానానికి చేరుకున్నదన్నమాటేగా! ఒక్కొక్కడిలో ఎంతప్రజాసామాన్య ముంటుంది. వందా? అబ్బో! బలే పెద్దదే! సంతాన నిరోధం చెయ్యవలసిందే? లేకపోతే వుదరాలు పగిలి పోవూ!?!

మర్నాడు వూరుకుంటాడా? అందులో గోపీ. మొహంకడుక్కుని వెళ్ళి స్నేహితుడితో చెప్పాడు.

"ఆ వూళ్ళో మనుషుల్లేరు?"

స్నేహితుడు చెప్పాడు.... 'అదే ప్రజాసామాన్యం."

"ఇళ్ళు లేవు"

స్నేహితుడు చెప్పాడు–"ప్రజాసామాన్యానికి ఇళ్ళుండవు."

"గోడల్లేవు"

"ప్రజాసామాన్యాని కంతే"

"అన్నీ అద్దాలే!"

"అదే ప్రజాసామాన్యం"

"బొమ్మలన్నీ నాలో లీనమైనాయి"

"నువ్వే ప్రజాసామాన్యం"

"మరంతా అలా అంటారే?"

"వాళ్ళే ప్రజాసామాన్యం"

ఆలోచించాడు. చెప్పాగా గోపీకి ఆలోచనలు ఎక్కువ చిన్నప్పుడే మలేరియా వచ్చిందనీ.

"ఆలోచనలు ఎక్కువై చెడిపోతున్నావ్."

అన్నాడు తండ్రి.

"అంటే ఏమిటి?" అని అడిగాడు గోపీ.

"అదే, ఇదే, ఇదే!" అన్నాడు తండ్రి.